

## బ్యాలెట్ బాక్సులన్నీ కరీంనగర్‌కే చేర్చాలి

వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
ఆదివారం | 23 ఫిబ్రవరి , 2025 | పేజీలు :08

# పేరుకే 'కిరాణం'..అమ్మేది మాత్రం' మద్యం'



గ్రామాల్లో
బెల్ట్ షాపుల జోరు
* పల్లెల్లో బార్లను తలపిస్తున్న
బెల్ట్ షాపులు
* నిబంధనలకు విరుద్ధంగా
బెల్ట్ షాపులు
*ఎన్నికల కోడ్ ఉన్న
పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

**ప్రజాపక్షం /గొల్లపల్లి :** వైన్స్ షాపుల యాజమాన్యాలు సిండికేట్ గా ఏర్పాటయ్యి విచ్చలవిడిగా బెల్ట్ షాపుల దందా కొనసాగిస్తున్న పరిస్థితి గొల్లపల్లి మండలం కేంద్రంలో నెలకొన్నది .గతంలో ఉన్న వాటికంటే రెట్టింపు సంఖ్యలో బెల్ట్ షాపుల యజమానులు జేబులు నింపుకుంటున్నారని మండల ప్రజలు వాపోతున్నారు .గొల్లపల్లి మండల కేంద్రంలోని వైన్ షాపుల టెండర్ దారులు సిండికేట్ గాఏర్పాటయ్యి బెల్ట్ షాపుల దందాను కొనసాగిస్తూ మద్యం ప్రియుల జేబులను గుల్ల చేస్తున్నారని ,వైన్ షాపులు మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి పొందినవి రెండు వైన్స్ లు ఉండగా మండల కేంద్రానికి దూరంగా ఉండే గ్రామాల్లోని మద్యం ప్రియులకు బెల్టు షాపులే గత వుతున్నాయని ,దీనితో వారు బెల్ట్ షాపులను ఆశ్రయించడం వలన బ్రాండ్ ను బట్టి బీర్ కు రూ.30 నుండి రూ.40,ఫుల్ బాటిల్ కు రూ.80 నుండి రూ. 120 వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు .అధిక రేటు పై ప్రశ్నించిన ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ,ఇది ఇలా ఉండగా బెల్ట్ షాపుల వారికి వైన్ షాప్ యజమానులు క్వార్టర్ సీసాకు కు రూ.5 నుంచి రూ. 10 వరకు,ఒక్కో బీరు కు రూ.10 నుంచి రూ. 15 వరకు వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు. ధరలను ప్రశ్నించిన మద్యం ప్రియులపై ఆగ్రహం చూపిస్తూ ధరలు అదేవిధంగా అమ్ముతామని అంటున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు .గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాలలో ఎక్కువ మంది పేరుకు కిరాణా దుకాణాలు ,హోటల్లుగా నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారని ,సొంత ఇళ్ళలో పెద్ద పెద్ద ఫ్రిజ్జులు పెట్టుకొని మరి విక్రయిస్తున్నారని ,వైన్ షాపుల యజమానులు బెల్ట్ షాపుల నిర్వాహకుల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారని అన్నారు .మద్యం మత్తులో ఇండ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు .పచ్చని సంసారాల్లో మద్యం చిచ్చు ,విచ్చలవిడిగా గ్రామాల్లో దొరుకుతున్న మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చులు పెడుతున్నాయని మండలంలోని ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు పుట్ట గొడుగుల వలె వేలుస్తున్నాయని దీంతో పొద్దంతా పనిచేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహి స్తుండటంతో యువత పెడదారి పడుతూ జీవితాలను మద్యంతరంగా చాలిస్తున్నారని ,ఈ విషయాన్ని సంబంధిత ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్టు వదిలేయడంపై ప్రజల్లో అధికారులపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు .ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

**బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ అధికారులు ...!**

ఎక్సైజ్ అధికారులు వైన్స్ షాపుల వైపు అసలు కన్నెత్తి చూడటం లేదని ,నెల నెల వారికి మామూళ్లు షాపుల నుండి అందుతున్నాయని ,దీనితో వారు ఇటు వైపే రావడం లేదని మండల ప్రజలు అంటున్నారు .ఎక్సైజ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వలన వైన్స్ షాపు యజమానులు ఇష్టారితిన బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారని మండల ప్రజలు అంటున్నారు.

**బెల్ట్ షాపులతో గ్రామాల్లో నేరాలు ...!**

గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణతో 18 సంవత్సరాలు నిండని యువకులు మద్యానికి బానిసై వారి భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు .కూలి పనులు చేసుకునే వారు వారికి పని చేస్తే వచ్చే డబ్బులను బెల్ట్ షాపుల్లో మద్యానికే వేచించడంతో వారి కుటుంబంలో గొడవలు వ స్తున్నాయంటున్నారు.బెల్టుషాపులతో దొంగతనాలు ,నేరాల పెరిగిపోతున్నాయంటున్నారు .ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు సిండికేట్ దం దాకు చెక్ పెట్టి వైన్స్ షాపులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు .

**ఎన్నికల కోడ్ ఉన్న ఆగని మద్యం అమ్మకాలు :**మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న గ్రామాల్లో బెల్ట్ షాపులలో యధావిధిగా అమ్మకాలు జరుగుతున్నాయి .మండలం వైపు ఎక్సైజ్ పోలీసులు తొంగి చూడడం లేదు .ఇప్పటికైనా కోడ్ అమలులో ఉందని బెల్ట్ షాపులను ఎక్సైజ్ పోలీసులు మూసి వేస్తారో లేక మనకు ఎందుకు అని వదిలేస్తారో వేచి చూడాలి.

# ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు..

## కలెక్టర్ అభిలాష అభినవ్..



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :**ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ,తదితర అంశాలపై పాత్రికేయులతో ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈనెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొత్తం 45 ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లాలో మొత్తం 19 వేల 107 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నట్లు తెలిపారు.ఇందులో 17వేల 141 మంది పట్టభద్రులు,1966 మంది ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు.ఇప్పటి వరకు 149 పోస్టల్ బ్యాలెట్ లు వచ్చినట్లు తెలిపారు.పట్టణంలోని ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో ఎన్నికల సామాగ్రిని ఈనెల 26వ తేదీన ఎన్నికల అధికారులకు అప్పగిస్తామన్నారు.రేపటి నుంచి 26వ తేదీ వరకు ఓటరు గుర్తింపు స్లిప్పులను పంపిణి చేస్తామన్నారు.ఓటరు ఓటు వినియోగంపై అవగాహన పెంపొందించడానికి ఆర్డిఓ కార్యాలయంలో 24,25వ తేదీల్లో అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రాలలో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఇప్పటికే ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు మాస్టర్ ట్రైనర్లచే రెండుసార్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ప్రత్యేకంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలుపరుస్తున్న బాలశక్తి కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 20వేల మంది విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి,ఆరోగ్య కార్డులను రూపొందించినట్లు తెలిపారు.ఈ పాత్రికేయుల సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్,ఆర్‌డిఓ రత్నకళ్యాణి,పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్,డిఎస్ఓ కిరణ్ కుమార్,డిఎం వేణుగోపాల్,ఎన్నికల విభాగం పర్యవేక్షులు శ్రీనివాస్,ఇడిఎం నదీం,పలువురు ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 'హెచ్చరిక' బోర్డు మాయం



**ప్రజాపక్షం/చెన్నూరు:**చెన్నూరు శనిగకుంట మత్తడి పేల్చివేత ఘటన మరవకముందే, అదే తరహాలో కొంతమంది బడా బిఆర్ఎస్ నేతలు అక్రమ చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెన్నూరు శివారులోని సర్వే నంబర్ 863లో విలేకరుల ఇళ్ల స్థలాల కోసం ప్రతిపాదించిన ప్రభుత్వ భూమిని కొం దరు బీఆర్ఎస్ నేతలు ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఆస్నాద్ గ్రామంలో విధులు నిర్వహించే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూడా ఇందులో పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. గురువారం రోజు ప్రభుత్వ అధికారులు హెచ్చరికా బోర్డు ఏర్పాటు చేయగా, శుక్రవారం రాత్రి అక్రమార్కులు ఆ బోర్డును తొలగించేశారు. విషయం తెలుసుకున్న చెన్నూరు తహసీల్దార్ మల్లిఖార్జున్ ఆదేశాలతో ఆర్ఐ అజీజ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం మరో హెచ్చరికా బోర్డు ఏర్పాటు చేశారు. చెన్నూరు ఎంఎల్ఏ గడ్డం వివేక్ మృదుస్వభావి కావడంతో, బిఆర్ఎస్ హయాంలో పలువురు రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రభుత్వ భూములను ఆక్రమించిన నేతలపై ఇప్పటికీ చర్యలు లేకపోవడం ఇది కొనసాగడానికి ప్రధాన కారణమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికే ఓ కీలక రెవెన్యూ అధికారి సహకారంతో అక్రమంగా రెండు ఎకరాల భూమిని దక్కించుకునే కుట్ర జరుగుతుందని, దీని కోసం సుమారు 80 లక్షల రూపాయలు లావాదేవీలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎంఎల్ఏ గడ్డం వివేక్ ఈ వ్యవహారంపై స్పందించి, పోలీసుల విచారణను వేగవంతం చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీ చైతన్య కళాశాలలో వీడ్కోలు సమావేశం




**ప్రజాపక్షం/చొప్పదండి:**చొప్పదండి పట్టణ కేంద్రంలోని శ్రీచైతన్య కళాశాల విధ్యార్థుల వీడ్కోలు సమావేశం వరలక్ష్మి ఫంక్షన్‌హాలులో ఘనంగా జరిగింది. ముఖ్య అతిధిగా కవి, సామాజికవేత్త సామాల కిరణ్ హాజరై విధ్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విధ్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల కరెస్పాండెంట్ అమిరి రత్నాకర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ గుండేటి వెంకటరమణ, డైరెక్టర్లు పంతగాని అనిల్ కుమార్, వెంగళ హరిప్రసాద్, అధ్యాపక బృందం స్వప్న, అనూష, సతీష్ తదితరులున్నారు.

## నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం



**ప్రజాపక్షం/తిమ్మాపూర్:**గ్రాడ్యుయేట్‌ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ మేడి అంజయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామశాఖ అధ్యక్షుడు తూముల శ్రీనివాస్, ఇందిరానగర్‌గ్రామశాఖఅధ్యక్షుడు అంజన్న, సుదగోని శ్రీనివాస్, జాఫర్ లున్నారు.

## యాదగిరి శేఖర్‌రావుకే ప్రైవేట్ పాఠశాలల మద్దతు



**ప్రజాపక్షం/రామడుగు:**ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న యాదగిరి శేఖర్‌రావుకే చొప్పదండి నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ సంధర్భంగా శనివారం మండల కేంద్రంలోని విన్నర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు, నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న శేఖర్‌రావుకే తమ మద్దతు ఉంటుందన్నారు. పట్టభద్రులందరూ ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరా రు. ప్రైవేట్ పాఠశాలల కరెస్పాండెంట్లు శ్రీనివాస్ రెడ్డి, ఆనందం, కిరణ్ తదితరులున్నారు.

## యూరియా కొరత సృష్టిస్తున్న డీలర్లపై చర్యలు




**ప్రజాపక్షం/తిమ్మాపూర్:**కరీంనగర్ జిల్లాలో ఫర్టిలైజర్ డీలర్లు కావాలనే యూరియా కృత్రిమ సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ పొటాష్ కొంటేనే యూరియా ఇస్తామంటున్న డీలర్లపై జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్ డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని పిఎసిఎస్ సొసైటీ వద్ద కార్యకర్తలు రైతులతో సమావేశం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న సంపత్ మాట్లాడుతూ గత 20 రోజులుగా జిల్లాలోని ఫర్టిలైజర్ యూరియా నిర్వహించుకుని యూరియా కొరత ఉందని కంపెనీలు సరిపడా సరఫరా చేయడం లేదని ప్రచారం చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నారని తెలిపారు. దీనిపై వెంటనే కలెక్టర్ స్పందించి విజిలెన్స్ అధికారుల ద్వారా, వ్యవసాయ అధికారులతో యూరియా డీలర్ల గోదాములను తనిఖీ చేసి అక్రమంగా నిల్వ చేసిన యూరియా బస్తాలను బయటకు తీసి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. దుకాణంలో పొటాష్ కొంటేనే యూరియా ఇస్తామని కండిషన్‌తో దుకాణదారులు రైతులను నిట్టనిలువునా దోచుకుంటున్నారన్నారు. పొలాలు వేసి నెల నుంచి 15 రోజులు కావస్తున్న తరుణంలో వారికి అందరూ కలుపు వేసి ఎరువులు చల్లుదామని సమయంలో వ్యాపార వేత్తలు కావాలనే ఎక్కువ ధరకు అమ్ముకోవడానికే ఈ విధమైన ప్రచారానికి తెరలేపారన్నారు. దీంతో రైతులు ఊర్లోకి యూరియా లోడ్ రాగానే వందలాదిగా సొసైటీల దగ్గర ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల దగ్గర గంటల తరబడి లైన్లో కట్టి యూరియతో పాటు అవసరం లేకున్నా ఇతర రసాయన మందులను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కలెక్టర్ చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం పార్టీ మండల కన్వీనర్ మాతంగి శంకర్, సభ్యులు పవన్, వి.కుమార్, మాతంగి లక్ష్మయ్య తదితరులున్నారు.

## పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ఫిబ్రవరి నెలలోనే జగిత్యాల జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతోంది.దీన్ని బట్టి చూస్తే వేసవిలో సూర్యుడు తన ప్రతాపం చూపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.ఫిబ్రవరిలోనే 38 డిగ్రీల ఉషనోగ్రతలు నమోదు అవుతున్నాయంటే వేసవిని ఉహించుకుండే కష్టంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం గోధురులో 38.3 డిగ్రీల ఉషనోగ్రత్త నమోదయిందని అధికారులు తెలిపారు.వెల్గటూరు, ధర్మపురి మండలం జైనాలో 38.2, సిరికొండలో 38.1, మేడిపల్లి, కొల్వాయి, అల్లీపూర్ అయిలాపూర్ లో 37.9, మన్నెగూడెం, మల్లాపూర్, రాఘవపేటలో 37.8, రాయికల్, మల్యాల లో 37.7,సారంగాపూర్, ధర్మపురిలో 37.6, కథలాపూర్, గొల్లపల్లిలో 37.5,మల్యాల మండలం మద్దుట్లలో 37.3,పెగడపల్లి, మెట్పల్లి, గుల్లకోటలో 37.2, జగిత్యాల పట్టణంలో 37.1 డిగ్రీల సెల్సీఎస్ నమోదు అయ్యాయి.

## హామీలు నెరవేర్చాలని పోస్టు కార్డు ద్వారా ఉద్యమం



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇల్లందకుంట మండల కేంద్రంలో మండల పోస్టాఫీసు కార్యాలయం వద్ద పోస్టు కార్డు ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలని 100 పోస్టు కార్డులు పంపారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే అమలు చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యిందన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకున్న పాపాన పోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందన్నారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర యువజన విభాగం కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మూడెడ్ల కుమారస్వామి, మండల అధ్యక్షులు రావుల రాజబాబు, నాయకులు టఫ్ నాయకులు పెద్ది కుమార్ తదితరులున్నారు.

## మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

### జాతర ఆదాయం రూ.13,18,872



**ప్రజాపక్షం/శంకరపట్నం:**మండల పరిధిలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి జాతర ఆదాయం రూ. 13 లక్షల 18 వేల 872 వచ్చినట్లు ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి తెలిపారు. కొత్తగట్టు గుట్టపై వెలసిన మత్స్యగిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాల సంధర్భంగా ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలలో హుండీలను ఏర్పాటు చేశారు. శనివారం హుండీలను లెక్కించారు. హుండీ ద్వారా 4 లక్షల 23 వేల 241 నగదు వచ్చినట్లు పేర్కొన్నారు. వేలం ద్వారా రూ. 6 లక్షల 53 వేలు, టికెట్ల విక్రయం ద్వారా 2 లక్షల 42 వేల 631 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వీటితో పాటు మిశ్రమ బంగారం, మిశ్రమ వెండిలను భక్తులు కానుకలు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో సుధాకర్, ఆలయ పూజారులు శేషం మురళీధరచార్యులు, శేషం మాధవాచార్యులు, ధర్మకర్తలు గరిగె ప్రభాకర్, కేశవేణి ఐలయ్య, ముకిరాల కళింగరావు, ఎడ్ల తిరుపతి, తీగల కుమారస్వామి, కొయ్యడ నీలమ్మ, ఆలయ సిబ్బంది తదితరులున్నారు.

## రైలు ఢీ కొని పశువులు మృతి..



**ప్రజాపక్షం/తలమడుగు :**తలమడుగు మండల కేంద్రం శివారులో మహారాష్ట్ర పూర్ణ నుండి ఆదిలాబాద్ వచ్చే పూర్ణ ప్యాసింజర్ రైలు వచ్చే సమయంలో అటు వైపుగా దారి దాటుతున్న మహారాష్ట్రకు చెందిన రైతు కద్తాల్ కు చెందిన ఐదు పశువులు,తలమడుగు మండల కేంద్రనికి చెందిన దాసరి సత్యనారాయణకు చెందిన ఆవు లు మృతి చెందా యి దాదా పు 9 ప శువులలో ఆరు ప శువులు మరణించగా మిగతావి తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాయి.

## గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్ ఇన్‌చార్జిగా రుద్ర సంతోష్

### ఉత్తర్వులు జారీ చేసిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:**కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్ ఇన్‌చార్జిగా కాంగ్రెస్ నేత రుద్ర సంతోష్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. రుద్ర సంతోష్ కుమార్ గతంలో 2023 అసెంబ్లీలో ఎన్నికల సమయంలో 31 ఎస్‌సి, ఎస్‌టి అసెంబ్లీ ఇంచార్జిగా, అలాగే ఎఐసిసి వార్ రూమ్ ఇంచార్జిగా పనిచేశారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో సెంట్రల్‌వార్‌రూం కో చైర్మన్‌గా పనిచేశారు. కాంగ్రెస్ ప్ర భుత్వం తీసుకున్న కులగణన సర్వేకు కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ పార్టీకి ప్రభుత్వానికి మధ్య వారధిగా ఏర్పాటు చేసిన టిపిసిసి కనెక్ట్ సెంటర్‌ను ఇంచార్జిగా ఉంటూ వేలాది మంది కార్యకర్తలతో నిత్యం అనుసంధానం చేస్తూ పనిచేస్తున్నారు.కాంగ్రెస్‌పార్టీలో మిషన్ మ్యాన్‌గా , పార్టీ కో ఆర్డినేషన్‌లో పేరొందిన రుద్ర సం తోష్ కుమార్‌కు ఈ బాధ్యతలు ఇవ్వడం శుభపరిణామం అని చర్చి ంచుకుంటున్నారు.

## దేశాయ్‌పేట్‌లో బసవేశ్వర ఆలయ పునః ప్రతిష్టాపన



**ప్రజాపక్షం/బాన్సువాడ:**బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో పురాతన బసవేశ్వర ఆలయాన్ని పునర్నిర్మించి శనివా రం పునః ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. నవతి శ్రీనివాస్ త న సొంత ఖర్చులతో ఆలయాన్ని పునర్నిర్మించి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పించినందుకు భక్తులు శ్రీనివాస్‌ను అభినందించారు. ఈసందర్భంగా మాజీ ఎంపిపి భునేకర్ ప్రకాష్, జ్యోతి ద ంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పునః ప్ర తిష్ట కార్యక్రమంలో భాగంగా యజ్ఞము, వాస్తుపూజ, గణపతి హో మము, నవగ్రహ పూజలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ,వీరప్ప, కాశీనాథ్, గ్రామ పెద్దలుపాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి...



**ప్రజాపక్షం /మాక్లూర్ :**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మాక్లూర్ మండల వ్యాప్తంగా గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ నరేందర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని, మండల వ్యాప్తంగా విస్తృ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాక్లూర్ ప్రాథమిక సహకార సంఘ ఛైర్మన్ బూరోల్ల అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అనేకమందికి ఉద్యోగ అవకాశాలను కల్పించిందని వారన్నారు. మేధావులు విద్యావంతులు ఆలోచించి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవి ప్రకాష్, ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ అశోక్, యూత్ మండల అధ్యక్షుడు వినోద్, రఫీక్, కిరణ్, సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కరీంనగర్ తరలిన బిజెపి శ్రేణులు

**ప్రజాపక్షం/ చందుర్తి :**బిజెపి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి,మల్కా కొ మురయ్యలకు మద్దతుగా కరీంనగర్ జిల్లా కేంద్రం లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల బిజెపి శ్రేణులు తరలి వె ళ్ళారు.తెరాస పార్టీ అసలు అభ్యర్థిని పెట్టలేదని, కాంగ్రెస్ అభ్యర్థికి గ్రాడ్యుయేట్లు ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. ప్రతి నిత్యం ప్రజలలో ఉంటూ, స్వచ్చంద సంస్థల ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన బిజెపిపార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి ని బారీ మేజారిటి తో గెలినించాలని కోరారు.

## చెరువులో పడి ఒకరు మృతి

ప్రజాపక్షం/మోర్తాడ్:నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం శెట్పల్లి గ్రామానికి చెందిన బండ్ల భీమన్న(55) అనే వ్యక్తి చెరువులో పడి మృతి చెందారు. ఎస్సై బి. విక్రమ్ తెలిపిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శెట్పల్లికి చెందిన బండ్ల భీమన్న గ్రామ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదశవాత్తు చెరువులో పడిపోయి మృతి చెందాడన్నారు. భీమన్న తమ్ముడు బండ్ల రాజన్న శనివారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విక్రమ్ తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ ఉమా భరద్వాజ్ అన్నారు. మండలంలోని బూరుగుడ సమీపంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాలను న్యాక్ మెంబర్ కోఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, సభ్యుడు డాక్టర్ చంద్ర కాంత్ డిగాన్కర్, గిరిజన శాఖ ఓఎస్డి నీరజ్ సింహాతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పరిస్థితి అడిగి తెలుసుకుని వారి విషయ సామర్థ్య స్థాయి పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కళాశాలలు కృషి చేయాలన్నారు. కళాశాలలో అందుతున్న వసతులు విద్యార్థుల స్థాయిలను బట్టి కళాశాలలకు గ్రేడింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గిరిజన కళాశాలలో వసతులతో పాటు నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పిజి కళాశాల ఏర్పాటు చేసుకునే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శారద, ఆర్సిఒ అగస్టీన్, ఐక్యుఏసి కోఆర్డినేటర్ కల్పన అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు పర్ధాన్‌ల బహిరంగసభ

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : పర్ధాన్ ల బహిరంగసభను విజయవంతం చేయాలని రాష్ట్రీయ పర్ధన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమరం వందన పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆదివారం అదిలాబాదులోని రాంలీల మైదానంలో జరిగే బహిరంగ సభకు పర్ధన్ కులస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి సభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రంలో పర్ధన్ కులస్తులకు ఏటువంటి గుర్తింపు లేదని, ఈ నేపథ్యంలో అందరం ఒకటై ఈ బహిరంగ సభకు భారీ సంఖ్యలో వచ్చి రాష్ట్రంలో తమ ఉనికిని ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా విజయవంతం చేయాలన్నారు. సంఘం జిల్లా నాయకులు రాయిసీడం భూద బాయి, కొమురం దేవురావు, కుర్సెంగా తిరుపతమ్మ, గెడం నందిని తదితరులు పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ మద్దతు

### సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్




ప్రజాపక్షం/ నిజామాబాద్ అర్బన్ : రాష్ట్రంలో పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వి. నరేందర్ రెడ్డికి సిపిఐ పార్టీ మద్దతు తెలుపుతున్నామని నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధికి మరింత ప్రోత్సహించే విధంగా పట్టభద్రుల చేయూత అవసరమన్నారు. ఈనెల 27న గురువారం జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ పార్టీలు బలపరిచిన అభ్యర్థి వి.నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. ఎన్నికలలో పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులతో పాటు జిల్లాలోని పట్టభద్రులు పాల్గొని వి.నరేందర్ రెడ్డి గెలుపుకై మొదటి ప్రాధాన్యత ఓటు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, నాయక్, సిపిఐ జిల్లా నాయకులు పి.నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## 1న పసుపు మద్దతు ధర కోసం ధర్నా

### టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : పసుపునకు 12 వేల కనీస ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని, అంతకు తక్కువ ధర ఉంటే మిగతా డబ్బును బోనస్ రూపంలో ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇప్పుడు 8 వేలకు మాత్రమే పసుపును కొనుగోలు చేస్తున్నారని, అయినా కూడా ప్రభుత్వం బోనస్ ఊసే ఎత్తడం లేదని, తక్షణమే పసుపుకు బోనస్ ప్రకటించాలని లేనిపక్షంలో మార్చి 1న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం నిజామాబాద్ మార్కెట్ యార్డును కవిత సందర్శించి పసుపు రైతుల సమస్యలపై స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేరుకే గెజిట్ జారీచేసి కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని, కానీ చట్టబద్ధత కల్పించలేదన్నారు. బోర్డుకు చట్టబద్ధత ఉంటే బయటి దేశాల నుంచి వచ్చే నాసిరకం పసుపు దిగుమతులు తగ్గుతాయని, దానివల్ల స్థానికంగా పసుపునకు మంచి రేటు వస్తుందన్నారు. మార్కెట్ యార్డులో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి పసుపు ధర తగ్గిస్తున్నారని, ఒకరకంగా రైతును బ్లాక్ మెయిల్ చేస్తున్న పరిస్థితి మార్కెట్ యార్డులో కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ నగర పాలక సంస్థ చైర్మన్ దండు నీతూకిరణ్, బిఆర్ఎస్ నాయకులు, పసుపు రైతులు పాల్గొన్నారు.

## ప్రసన్న హరికృష్ణకు విద్యార్థి సంఘాల మద్దతు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ బిఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు ఓయూ జేఏసి అన్ని విద్యార్థి సంఘాల నుంచి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓయూ జేఏసీ నేత కోడూరి రఘు మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ప్రధాన జాతీయ పార్టీలు అగ్రవర్ణాల పెత్తందారులకు మాత్రమే టికెట్ ఇచ్చి ప్రోత్సహించారని దుయ్యబట్టారు. డాక్టర్ ప్రసన్న హరికృష్ణ బహుజన బిడ్డ అని, పూర్వ ఉస్మానియా విద్యార్థిగా విద్యను అభ్యసించారని తెలిపారు. ఎన్నో విద్యార్థి ఉద్యమాల్లో ఆయన పాల్గొన్నారని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి చదువునే పెట్టుబడిగా పెట్టుకుని పేద విద్యార్థులకు నేర్చుకున్న జ్ఞానాన్ని అందించారన్నారు. ఎన్నో వందల పుస్తకాలు రచించి వేలాది మందికి ఉచిత విద్యనందించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా ఎంచుకుని ఎమ్మెల్సీగా బరిలో ఉన్న ప్రసన్న హరికృష్ణకు అండగా నిలవాల్సిన అవసరముందన్నారు. ప్రతి పట్టభద్రుడు, ఉద్యోగులు, మేధావులు అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్పోరేట్ వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడానికే అధికారంలోకి రావాలనుకున్న వారిని గెలిపిస్తే ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టినట్లే అవుతుందని, పట్టభద్రులు ఆలోచించి ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. శాసనమండలిలో బహుజన గొంతుగా వినిపించేందుకు ఓటు వేయాలని కోరారు.

## సిపిఆర్ చేసి యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లు

ప్రజాపక్షం / ధర్మపురి : రోడ్డు ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలో ఉన్న యువకుడికి ధర్మపురి పోలీసు కానిస్టేబుళ్లు సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. ఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన కాసెట్టి కృతిక్(21) ధర్మపురి సమీప గ్రామంలో శుభకార్యానికి వచ్చాడు. శుక్రవారం రాత్రి 10గంటలకు పని నిమిత్తం ఇరువురు బాలికలతో బైక్‌పై ధర్మపురికి వచ్చి తిరిగి వెళ్తుండగా స్థానిక పోలీస్ స్టేషన్ ముందు అకస్మాత్తుగా కుక్క అడ్డురాగా తప్పించబోయి కిందపడ్డాడు. శబ్దం విని స్టేషన్‌లో ఉన్న కానిస్టేబుళ్లు మాటి రమేష్, ఎస్‌కే ఆరిఫ్‌లు పరుగెత్తుకుని వచ్చి అపస్మారక స్థితిలో క్షతగాత్రుడికి సిపిఆర్ చేశారు. కొద్దిసేపటికి కృతిక్ స్పృహలోకి రాగా ఆంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.వెంట వచ్చిన అమ్మాయిలకుసైతం గాయాలు అయ్యాయి. కాగా సమయానుకూలంగా స్పందించి యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్స్ రమేష్, ఆరిఫ్‌లను సిఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్‌లు అభినందించారు.



## నగునూరు జడ్పీహెచ్ఎస్ తనిఖీ



ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధిస్తున్న బోధన పద్ధతులను టిఎస్ఏటి ద్వారా పదవ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శింపబడుతున్న పాఠ్యాంశాలను విద్యార్థులతో కలిసి చూశారు. అనంతరం జన్యు సంస్థ ద్వారా నిర్వహించబడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విటమిన్ గార్డెన్ పరిశీలించి అందులో పెంచుతున్న మొక్కలలో గణిత ప్రక్రియలకు సంబంధించిన ఆకృతులను పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయునికి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చామన్‌పల్లి పాఠశాల సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న జన్యు కార్యక్రమాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు తిరుపతి, సైన్స్ ఉపాధ్యాయులు మదన్, శంకరయ్య తదితరులున్నారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు బండారి అఖిల్ హైదరాబాదులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా శనివారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం బండారి అఖిల్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మునిగాల సుధాకర్ గౌడ్, మునిగాల చందు, పెరుమాండ్ల గంగయ్య, ముద్దం తిరుపతి, కనుమల్ల రాజశేఖర్, నల్లాల అఖిల్‌లు పాల్గొన్నారు.

## గృహప్రవేశానికి ఎంపి

ప్రజాపక్షం / మల్లాపూర్ : మండల కేంద్రంలో శనివారం నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ పర్యటించి బిజెపి మండల శాఖ ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్ నూతన గృహప్రవేశకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు బిజెపి మండల అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విందు స్వీకరించి కార్యకర్తలతో మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసి మొట్ట మొదటిసారిగా మండలానికి విచ్చేసిన ఎంపిని పసుపు కొమ్ముతో పూలదండను తయారు చేసి అభినందనలు తెలిపారు. అనంతరం గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శివకుమార్‌కు అభినందనలు తెలిపారు. జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర లక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షుడు ముప్పెరి రాజ్ కుమార్, నాయకులు రాజేందర్ నాయక్, శ్రీహరి, సతీష్, దివాకర్, మనోజ్, రాకేష్, రాజు తదితరులు ఉన్నారు.



## మహా కుంభామేళాలో పాల్గొన్న డిసిసి నాయకుడు



**ప్రజాపక్షం/పాలకుర్తి :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో పెద్దపల్లి డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య పాల్గొన్నారు. 144 ఏళ్లకోసారి ఈ మహా కుంభమేళాను నిర్వహిస్తారు. గంగా, యమునా, సరస్వతి నదుల సంగమమైన త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు సమ్మయ్య తెలిపారు. నది ఒడ్డున ప్రత్యేక పూజలు చేశారు. అగ్ని వేడుకలు, హారతి పూజల్లో పాల్గొన్నారు. సమ్మయ్యతోపాటు పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్ గ్రామ మాజీ వార్డు సభ్యులు సంపంగి కుమార్, రాజు ఉన్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/రామగిరి:**రామగిరి మండల నూతన తాసిల్దారుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పి. సుమన్ ను తాసిల్దార్ కార్యాలయంలో శనివారం రామగిరి మండల కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ బాబు రావు, గొర్రె నరేష్, బాద్రపు శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాంగ్రెస్ మహిళా నాయకుల నియామకం..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ లో డిసిసి అధ్యక్షుడు శ్రీహరి రావు శనివారం జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దుర్గ భవాని నూతన జిల్లా కార్యవర్గాన్ని నియమించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ ,అదిలాబాద్,కరీంనగర్,నిజామాబాద్ పట్టభద్రుల సిట్టింగ్ స్థానం మళ్లీ కైవసం చేసుకుందామని అన్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలోని డిసిసి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు భవాని నేతృత్వంలో డిసిసి అధ్యక్షుడు శ్రీహరిరావు చేతుల మీదుగా ఆయా మండలాలలకు అధ్యక్షురాల్లకు నియామక పత్రాలను అందజేశారు.జిల్లా కాంగ్రెస్ మహిళా ఉప అధ్యక్షురాలు గా తన్నే లక్ష్మి ,కడెం మండల మాదాసు సురేఖ,సోన్ మండలం రేఖా,నిర్మల్ పట్టణం వాసవి, కుబీర్ మండలం నికిత రాథోడ్, కుం టాల మండలం గంగామణిలకు నియమిస్తూ నియామక పత్రాలు అందజేసారు.ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కష్టపడి పని చేయాలని సూచించారు.

# రైతులను దగా చేసిన ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి

### మాజీ ఎంఎల్ఎ దివాకర్ రావు

**ప్రజాపక్షం/దండేపల్లి :** రైతుల్ని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని మంచిర్యాల మాజీ ఎంఎల్ఎ నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సన్నరకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 76 రోజులైనా ఇప్పటికీ బోనస్ డబ్బులు అందలేదని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట మార్చిందని అన్నారు. మాట మార్చడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో చెరువులు, ప్రాజెక్టులు నిర్మించి రైతులకు మేలు చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు తీయడమే పనిగా పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగా, కాంగ్రెస్ ప్రభుత్వం పద్నాలుగు నెలల్లోనే అన్నీ నిర్వీర్యం చేస్తూ విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, గెలిచాక కేవలం సన్న వడ్లకే పరిమితం చేసిందని దివాకర్ రావు అన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో బోనస్ కింద రూ.7.67 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 18 లక్షల రూపాయలు మాత్రమే 39 మంది రైతులకు అందించారని ఆరోపించారు. ఇంకా బకాయి ఉన్న మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్ఐ తైసోద్దీన్, ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉందని రాస్తారోకో విరమించాలని కోరగా, మాజీ ఎంఎల్ఎ అంగీకరించకపోవడంతో పోలీసులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. అనంతరం పోలీసులు మాజీ ఎంఎల్ఎను పక్కకు తీసుకెళ్లి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ కాసనగుట్ల లింగన్న, వైస్ చైర్మన్ అక్కల రవి, మాజీ వైస్ ఎంపిపి పసర్తి అనిల్, లక్సెట్టిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, రేణి శ్రీనివాస్ యాదవ్, గోట్ల భూమన్న యాదవ్, పాదం శ్రీనివాస్, గోళ్ళ రాయమల్లు, పత్తిపాక శ్రీనివాస్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# బిఎంఎస్ తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నాం

### ఐఎన్‌టియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**డిఎచ్ఎఫ్ఎల్‌సిఎంపిఎఫ్ కేసులో బిఎంఎస్ నేత కె. లక్ష్మి రెడ్డి కాంగ్రెస్ నాయకుడు రాబర్ట్ వాద్రాపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఐఎన్‌టియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు తెలిపారు. బిఎంఎస్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లోనే డిఎచ్ఎఫ్ఎల్ డిబెంచర్ల విమోచనకు సంబంధించిన పరిణామాలు ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలో ఈ పెట్టుబడులు జరగలేదని స్పష్టం చేశారు. యుపిఎ హయాంలో దుర్వినియోగం జరిగి ఉంటే, గత పది సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి అని ప్రశ్నించారు. బొగ్గు పరిశ్రమలో జాతీయాకరణ ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించిన ఇందిరా గాంధీని పలువురు నాయకులు ప్రశంసించారని గుర్తు చేశారు. సిఎంపిఎఫ్ ట్రస్ట్‌లో సమిష్టి నిర్ణయాలే తీసుకుంటారే తప్ప, ఏకపక్షంగా పెట్టుబడులు పెట్టడం అసంభవమని స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని లేకుంటే ఐఎన్టీయూసి ఇతర కార్మిక సంఘాలతో కలిసి తీవ్ర ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.

# నర్సరీ కార్మికుల కనీస వేతనాలకు ఉత్తర్వులు జారీ

**ప్రజాపక్ష/పెద్దపల్లి ప్రతినిధి:**సింగరేణి వ్యాప్తంగా నర్సరీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 2022 లో చేసిన 18 రోజుల సమ్మె సందర్భంగా యూనియన్ లు యాజమాన్యం తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అట్టి ఒప్పందం లోని డిమాండ్ లను అమలు చేయాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి కోరిన మేరకు యాజమాన్యం నర్సరీ లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చట్ట బద్ధమైన హక్కులను అమలు చేసేందుకు తగు ఆదేశాలు జారీ చేసిందని ఆయన వెల్లడించారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు కృషి ఫలితంగా సింగరేణి వ్యాప్తంగా నర్సరీ కార్మికులకు మార్చి 1వ తేదీ నుండి కనీస వేతనాల అమలు,సీఎం పిఎఫ్, బోనస్సు,బ్యాంకు జీతాలు తదితర హక్కుల ను అమలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. కనుక నర్సరీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఏఐటియుసి కృషి ని గమనించగలరని ఆయన ఒక ప్రకటన లో పేర్కొన్నారు.

# ఎస్ఐఒ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు బడ్జెట్ సిఫార్సులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (SIO) పెద్దపల్లి జిల్లా ప్రతినిధుల బృందం, జిల్లా కార్యదర్శి షోయబ్ ఉల్లాఖాన్ నేతృత్వంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావును శనివారం మ ర్యాదపూర్వకంగా కలిసారు. 2025 26 తెలంగాణ బడ్జెట్ లో విద్య, యువజన సంక్షేమానికి సంబంధించి పలు సిఫార్సులతో కూడిన పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. వి ద్య, ఉపాధి, విద్యార్థుల సంక్షేమం వంటి ప్రధాన సమస్యల ను చర్చిస్తూ, ఈ సిఫార్సులను రాబోయే బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ఎమ్మెల్యేను కోరారు. విద్యా రంగానికి తగినంత నిధులు కేటాయించకపోవడం వల్ల పాఠశాలల్లో మౌ లిక వసతుల కల్పనలో లోపాలు, ఉపాధ్యాయుల కొరత, వి ద్యార్థుల డ్రాప్ ఔట్ శాతం పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ప్రతినిధుల బృందం తెలియజేసింది. 3 ను ండి 5వ తరగతి విద్యార్థుల్లో కేవలం 18 శాతం మంది మాత్రమే రెండో తరగతి స్థాయి పాఠాన్ని చదవగలుగుతున్నారని, కేవలం 49 శాతం మంది మాత్రమే ప్రాథమిక గ ణిత ప్రశ్నలను పరిష్కరించగలుగుతున్నారని వివరించారు. ఈ లోటును తీర్చేందుకు కనీసం రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం విద్యా రంగానికి కేటాయించాలని ఎస్ఐఒ సూచించింది. తెలంగాణలో యువ నిరుద్యోగ శాతం 16.6 శాతంగా ఉ ండటం, జాతీయ సగటు 10.2శాతం కంటే ఎక్కువగా ఉం డటాన్ని ప్రతినిధుల బృందం ఆందోళన వ్యక్తం చేసింది. నై పుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, మానసిక ఆరోగ్య సహాయం, స్టార్ట్ అప్, ఎంటర్‌ప్రెన్యూర్షిప్ రంగాల్లో పెట్టుబడులు పె ట్టాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మై నారిటీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందించేందుకు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, బో ధన సిబ్బందిని నియమించడం, మరియు అధునాతన బో ధనా పద్ధతులను ప్రవేశపెట్టడం అవసరమని వారు పేర్కొన్నారు. ఎస్ఐఓ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఖాజా అఫ్వాన్ మొహియుద్దీన్ మాట్లాడుతూ విద్య అనేది సమాజ అభివృద్ధికి మూలస్తంభమన్నారు. ఎస్ఐఓ విజ్ఞప్తిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

## సింగరేణి పాఠశాలలో ఘనంగా‘బేడెన్ పొవెల్’ జయంతి

**ప్రజాపక్షం/మందమర్రి:**మందమర్రి సింగరేణి పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థాపకుడు బేడెన్ పొవెల్ జయంతి సందర్భంగా ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏరియా పర్సనల్ మేనేజర్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ ఎస్. శ్యాంసుందర్ బేడెన్ పొవెల్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. సర్వమత సమ్మేళనం, ప్రార్థన గీతంతో కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థాపకుడు బేడెన్ పొవెల్ జన్మదినం సందర్భంగా ఫిబ్రవరి 22న ప్రపంచవ్యాప్తంగా ఆలోచన దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సాహసమే ఊపిరిగా, సేవే పరమావధిగా ప్రపంచాన్ని మారుద్దాం అనే సందేశాన్ని ఆయన అందించారని తెలిపారు. పిల్లల్లో అపార శక్తి ఉంది. చిన్నప్పటి నుంచే దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందిస్తే మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చు. ఈ లక్ష్యంతోనే స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థను ఆయన స్థాపించారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జే. పురుషోత్తం, స్కౌట్ మాస్టర్ శక్తి కుమార్, గైడ్స్ మాస్టర్ కల్పలత, ఉపాధ్యాయుడు, స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి పాఠశాలలో ఘనంగా ప్రపంచ ఆలోచన దినోత్సవం



**ప్రజాపక్షం/ నస్పూర్ :**లార్డ్ బేడెన్ పొవెల్ జయంతి సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా, నస్పూర్‌లోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరాంపూర్ ప్రాంత శాఖా ఉప ప్రధాన వ్యూహకర్త (వ్యక్తిగత వ్యవహారాలు) పి. అరవింద్ రావు స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులతో కలిసి సర్వమత ప్రార్థనలో పాల్గొని, జెండా ఎగురవేసి, లార్డ్ బేడెన్ పొవెల్ చిత్రపటానికి పుష్ప మాల అర్పించారు. అనంతరం మందమర్రిలో జరిగిన మూడవ స్థాయిలో ప్రమాణ పరీక్ష శిబిరంలో ప్రతిభ కనబరిచిన గైడ్ విద్యార్థులకు ధృవపత్రాలు అందజేశారు. అలాగే ముగ్గురు స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు ప్రత్యేక దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లార్డ్ బేడెన్ పొవెల్ ఆచారాలను అనుసరిస్తూ, క్రమశిక్షణతో సమాజ సేవలో పాల్గొంటూ, బాధ్యతాయుతమైన భారత పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జెండా ఊపి స్కౌట్స్, గైడ్స్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సంచాలకుడు ప్రాంతీయ వ్యక్తిగత వ్యూహకర్త (శ్రీరాంపూర్) ఎ. రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు బి. సంతోష్, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్. రాధాకృష్ణమూర్తి, గైడ్ మార్గదర్శి శ్రీమతి జె. హేమలత, స్కౌట్ ఉపాధ్యాయుడు జి. శ్రావణ్ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపికి ఒయుజెఎసి మద్దతు

### ఒయుజెఎసి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :**తెలంగాణా రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థిని నిలబెట్టిన బిజెపికి ప్రతీ ఒక్కరు ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఉస్మానియ యూనివర్సిటీ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరాం పిలుపునిచ్చారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీరాం మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి పార్టీకి బేషరతుగా మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బిజెపి బిసి అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించడం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులు చాలాకాలంగా ఎదురుకొంటున్న జిఒ 317, భార్యాభర్తల మ్యూచువల్ బదిలీ సమస్యలు, గురుకుల టీచర్లను బోధనేతర బాధ్యతల నుండి తప్పించడం, రాత్రివేళల్లో విధులు లేకుండా చేయడం వంటి సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పార్టీలకతీతంగా బిజెపి బలపరిచిన బిసిఅభ్యర్థి కొమురయ్యను గెలిపించి ఉపాధ్యాయుల సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రేమ్ కుమార్, తిరుపతి, సాయి, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలోచించి ఓటేయ్యాలి




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మండలిలో ప్రశ్నించే సత్తా కేవలంబిజెపికి మాత్రమే ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా జిల్లా పర్యటనలో భాగంగా శనివారం బిజెపిజిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుతుందని ఆరోపించారు. శాసనమండలిలో ప్రతిపక్ష హోదా లేకుండా మండలి ప్రాధాన్యతను తగ్గిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను నొక్కేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం మండలిలో ప్రభుత్వాన్ని నిలదీసి తెలంగాణ అభివృద్ధి దిశగా సాగాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపిఅభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వంద రోజుల్లో అమలు చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు 400 రోజులైనా అమలు కావటం లేదని కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో సబ్బండ వర్గాలు అసంతృప్తితో ఉన్నాయన్నారు. బిజెపితోనే తెలంగాణకు ఉజ్వల భవిష్యత్తు ఉందని వెల్లడించారు. సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ చర్చకు రావలని సవాల్ విసురుతున్నారని ఎన్నికలలో ఇచ్చిన ఎన్ని హామీలు అమలు చేశారని మీతో ఎందుకు చర్చకు రావలన్నారు. తాను విద్యార్థి దశలో ఉన్నప్పటి నుండి జిల్లాకు పసుపు బోర్డు డిమాండ్ ఉందని ప్రస్తుతం మోదీ, ఎంపి ధర్మపురి అరవింద్ కృషితోని సుధీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పసుపు బోర్డు కల సాకారం అయ్యిందన్నారు. అదేవిధంగా కులగణనకు బిజెపివ్యతిరేకం కాదని బిసి సామాజిక వర్గాలను అన్యాయం చేసేలా ముస్లింలను బిసిలలో చేర్చటం వ్యతిరేకిస్తున్నామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా బిజెపిముందడుగు వేస్తుందని అందుకోసమే రాష్ట్ర నాయకులు పని చేస్తున్నారన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాలకు పరిమితమైందని ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఆ రాష్ట్రాల్లో కూడా బిజెపిఅధికారంలోకి రావటం ఖాయమన్నారు. మేధావులు నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉద్యమకారులు, విద్యావంతులు ఏకమై బిజెపి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నిర్మల్ ఎమ్మెల్యే శాసనసభ పక్షనేత మహేశ్వర్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు కులచారి దినేష్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.

## ఎన్‌టిపిసి బూడిద అక్రమ దందాపై ప్రజలకు సమాధానం

* బిఆర్ఎస్ నాయకుడు కౌశిక హరిని అరెస్టు చేసిన పోలీసులు



ప్రజాపక్షం/గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లిలోని ఎన్‌టిపిసి బూడిద చెరువుల నుంచి అక్రమంగా బూడిద లోడింగ్, రవాణా జరుగుతున్నదనే విషయమై బూడిద చెరువుల వద్దకు వెళ్లి నిరసన తెలియజేసేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరిని గోదావరిఖనిలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం వద్ద పోలీసులు శనివారం అరెస్టు చేశారు. హరితోపాటు పలువురు నాయకులను అరెస్టు చేసి మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కౌశిక హరి మాట్లాడుతూ బూడిద అక్రమ లోడింగ్, రవాణా విషయంలో ప్రశ్నించేందుకు వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేయడం సరైన విధానం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూడిద చెరువుల వద్ద ఏలాంటి అక్రమాలు జరగడంలేదని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు తాను అక్కడికి వెళ్తానంటే ఎందుకు భయపడ్తున్నారని ప్రశ్నించారు. బూడిద చెరువుల వద్ద అక్రమాలు జరుగుతున్నాయా? లేదా? అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు, కాంగ్రెస్ నాయకులకు ఉందన్నారు. శాంతియుతంగా బూడిద చెరువులను పరిశీలించేందుకు కూడ అనుమతి ఇవ్వడంలేదంటే అక్కడ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయనేది ప్రజలు భావించాల్సి వస్తుందన్నారు. పోలీసుల అరెస్టులతో తమను అడ్డుకున్నప్పటికి ఏనాటికైన బూడిద అక్రమ దందాపై ప్రజలకు, ఎన్‌టిపిసిప్రభావిత, భూనిర్వాసిత కుటుంబాలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు ఉందన్నారు. ఎన్‌టిపిసి యాజమాన్యం నిబంధనలు పాటిస్తూ బూడిద లోడింగ్ జరగాలని, స్థానిక లారీలకు లోడింగ్ ఇచ్చాకే లైన్‌బండ్లకు అనుమతి ఇవ్వాలని, ఓవర్ లోడ్ లేకుండా రవాణా చేపట్టాలని, రహదారులపై బూడిద కాలుష్యం కలగకుండా చూడాలని కౌశిక హరి డిమాండ్ చేశారు.

## ఆర్‌జియుకెటిలో అభివృద్ధి లక్ష్యాల కార్యక్రమం..



ప్రజాపక్షం/బాసర:రాజీవ్ గాంధీ యూనివర్సిటి ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్,బాసర 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్.డి.జిఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించింది,ఇది ఐక్య రాజ్యసమితి యొక్క ప్రపంచ ఎజెండాకు అనుగుణంగా ఉంది.ఈ కార్యక్రమాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్,ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్డీ)ప్రొఫెసర్ ఇ.మురళీ దర్శన్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ఎ.ఐ శ్రీ రణధీర్ సాగి,ఇతర సంబంధిత అధికారుల సమక్షంలో అధికారికంగా ప్రారంభించారు. 17ఎస్‌డిజిలను కార్యక్రమం స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం,ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడం,ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడం,అందరికీ మెరుగైన భవిష్యత్తును నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు.ఆర్‌జియుకెటి విద్యార్థులు 17 అంశాల్లో 10 అంశాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.పేదరిక నిర్మూలన,స్థిరమైన వ్యవసాయం,ఆహార భద్రత,ఆరోగ్య సంరక్షణ,నాణ్యమైన విద్య సమగ్ర సమాన విద్యను అందించడానికి తగిన ఆలోచనలు చేయాలని సూచించారు.స్థిరమైన మౌలిక సదుపాయాలు,ఆవిష్కరణలను ప్రోత్సహించడం,వాతావరణ మార్పు దాని ప్రభావాలను పరిష్కరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు.ఆర్‌జియుకెటి స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి 17ఎస్ డిజిలను సాధించడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్ రెడ్డి,ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు తమ విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులంతా తమ విధుల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించబోవు అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.మాస్టర్ ట్రైనర్లు అధికారులకు ఎన్నికల ముందు,ఎన్నికల సమయంలో,ఎన్నికల తర్వాత నిర్వహించవలసిన విధులపై అధికారులకు శిక్షణ ఇచ్చారు.పోలింగ్ ప్రక్రియకు వినియోగించే బ్యాలెట్ బాక్సులు,అన్ని రకాల ఫారాములతో సమూనా ఓటింగ్ ప్రక్రియను వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈనెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 46 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంప్,వీల్ చైర్లు,మరుగుదొడ్లు,విద్యుత్,తదితర వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలన్నారు.ఎన్నికల రోజు ముందు,ఉదయమే ఎన్నికల విధులు నిర్వహించు అధికారులు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియానికి చేరుకొని తమకు కేటాయించిన ఎన్నికల సామాగ్రిని తీసుకొని,తమకు ఇచ్చిన సామాగ్రిని ఒకటికి రెండుసార్లు సరి చేసుకోవాలి అన్నారు.అమకు అందజేసిన ఎన్నికల పేపర్ సామాగ్రిలో ముద్రణ లోపం ఉన్నా.చిరిగిపోయిట్లు ఉన్న వాటిని తిరిగి వెనక్కి ఇచ్చి,వేరే సామాగ్రిని తీసుకోవాలన్నారు.పోలింగ్ కేంద్రంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాల పోస్టర్లు,ఓటర్లకు అవగాహన కల్పించేలా పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు.ఎన్నికల సంఘం గుర్తించిన 14 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదానిని ఓటరు ఓటు వేయడానికి తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.ఈ గుర్తింపు కార్డులలోని చివరి 4 అంకెలను సంబంధిత ఫారాలలో అధికారులు నమోదు చేయాలన్నారు.మొదటగా ఓటరు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించగానే ఓటరు వివరాలను సరిపోల్చి ఎడమచేతి చూపుడు వేలుకు సిరాను పూయాలన్నారు.దివ్యాంగ ఓటర్లకు సంబంధించి,18 సంవత్సరాల నిండిన వారిని సహాయకులుగా ఓటు వేయడానికి అనుమతించాలన్నారు.వీరికి సాధారణానికి భిన్నంగా కుడి చేతి చూపుడు వేలుకి సిరాను రాయలన్నారు.వీరి నుంచి సంబంధిత ధృవీకరణను తీసుకోవాలన్నారు.ఎన్నికలు ప్రారంభం కాగానే ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదైన ఓటింగ్ వివరాలను పై అధికారులకు అందజేయాలన్నారు.ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సామాగ్రిని జాగ్రత్తగా నిర్దేశిత ప్రదేశాలకు చేర్చాలన్నారు.అధికారులు తమ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.అనంతరం అధికారుల సందేహాలను మాస్టర్ ట్రైనర్ లు నివృత్తి చేశారు.ఈ శిక్షణ సమావేశంలో మాస్టర్ ట్రెయినర్లు రవి,లింబాద్రిలు,ఎన్నికల విధుల్లో పాల్గొనబోవు అధికారులు,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ఎఐటియూసి అనుబంధ సంస్థ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం మూడవ మహాసభలను వేములవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాభవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షునిగా అజ్జ వేణు, అధ్యక్షులుగా గాజుల పోశెట్టి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరెపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కడారి రాములు, ఉపాధ్యాక్షులుగా ఎల్ల దేవరాజు, శ్రీరాముల నర్సయ్య, బొల్లె బాబు, కార్యదర్శి పండుగ పోచమల్లు, మెతుకు లచ్చయ్య, ఎగదండి మల్లవ్వ, లింగాల వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా పెంట మల్లయ్య, కురుమ లచ్చయ్య, గుంటి అంజయ్య, తోట వెంకటేశం, కోరెపు క్రాంతి, సుంకపాక లక్ష్మి , గంగాధర లచ్చన్న, తైదల శ్రీనివాస్, దప్పు స్వామి, మాందాల అంజవ్వ, కౌన్సిల్ సభ్యులు కొత్తపెల్లి రవిచారి, సంద్రగిరి లక్ష్మి కాంత్, కాశారపు చంద్రమౌళి విక్రమ్, తాటికొర్ల ఎల్లయ్య, ఆకుల ఆంజనేయులు, వావిలాల రాము, పిట్టల శ్రీనివాస్, దుమ్మ లక్ష్మణ్, బిజిలి, బాలయ్య, అత్తిని రవి, అక్కినపల్లి సాగర్, మహంకాళి లక్ష్మి రాజం, తోట రమేష్, కొట్టెపల్లి రమేష్, పందిపెల్లి రాజయ్య, పందిపెల్లి శేఖర్, పెరిక మణితేజ, కుమ్మరి లక్ష్మణ్, కుమ్మరి చినకొంరయ్య తదితరులను ఎన్నుకున్నారు.

## 'టి శాట్'ప్రసారం 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకం..



ప్రజాపక్షం/ఖానాపూర్:రానున్న పదవ తరగతి పరీక్షల వరకు ప్రత్యేక టి శాట్ ప్రసారాలను వీక్షించిన విద్యార్థులు,ఖానాపూర్ మండల మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం రెండు టివి ప్యానెల్ లను ఏర్పాటు చేసి ఉదయం 9.30 నుండి సాయంత్రం 5 గం వరకు 129 మంది పదవ తరగతి విద్యార్థులకు ఆయా సబ్జెక్టు గురించి ప్రసారం అయిన కార్యక్రమాలను విద్యార్థులచే పాఠశాల ఉపాధ్యాయులు వీక్షింపచేసారు.తెలుగు, హిందీ,ఆంగ్లం, గణితం, సైన్స్,సోషల్ సబ్జెక్టుల్లో విషయ నిపుణులచే టి శాట్ లైవ్ కార్యక్రమం ప్రసారము కాగా విద్యార్థులు తమ అనుమానాలను లైవ్ ప్రసారం ద్వారా నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులుబోనగిరినరేందర్‌రావు,విషయనిపుణులుఫరాజ్,దీప్తి,లక్ష్మణ్ రావు,రవి,శోభారాణి,విజయ్,షఫీలుపాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాపక్షం/బెల్లంపల్లి :యువత క్రీడలపై మక్కువ పెంచుకొని రాణించాలని బెల్లంపల్లి రూరల్ సిఐ అఫ్జలుద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వర్గీయ పూదరి సత్యనారాయణ గౌడ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలైన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైనప్పటికీ ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.గత 15 రోజులుగా మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఈ పోటీలో మ ంచిర్యాల జిల్లాకు చెందిన 42 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్లో నెన్నెల్ మరియు భీమారం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన భీమారం జట్టు బౌలింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో నెన్నెల్ జట్టు 5 వికెట్ల న ష్టానికి 88 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో భీమారం జట్టు 10 ఓ వర్లలో 80 పరుగులు మాత్రమే చేసి, 9 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. విజేత నెన్నెల్ జట్టుకు, రెండో స్థానంలో నిలిచిన భీ మారం జట్టుకు బెల్లంపల్లి రూరల్ సిఐ అఫ్జలుద్దీన్, స్థానిక ఎస్ఐ ప్రసాద్, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంజద్ షీల్డులు అందజేశారు. అదనంగా, నెన్నెల్ జట్టుకు రూ. 20,000 నగదు, భీమారం జట్టుకు రూ .10,000 నగదు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల క్రీడాకారులు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

నిరుపేద వారి కోసం రూ.220 ఉచిత కంటి ఆపరేషన్

క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బు కేశవరెడ్డి

ప్రజాపక్షం/ముత్తారం : లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటనరీ కాలనీ,రేకుర్తి కంటి ఆసుపత్రి కరీంనగర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బు కేశవరెడ్డి సహకారంతో తేది ఫిబ్రవరి 24 సోమవారం రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ భవనం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని గంట వెంకటరమణ రెడ్డి తెలిపారు.శనివారం లక్కారం గ్రామపంచాయతీ ఆవరణంలో కంటి వైద్య శిబిరం సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఈ వైద్య శిబిరంలో కంటి చూపులో లోపాలున్న వారికి డాక్టర్లచే పరీక్ష చేయించి వారిలో మోతె బిందు (కంటిలో శుక్లాలు) ఉన్నవారిని గుర్తించి ఆపరేషన్ అవసరమైన వారిని వెంటనే రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ కరీంనగర్ తీసుకువెళ్లి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించబడును. అలాగే ఆసుపత్రి నందు భోజనం, వసతి, కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇవ్వబడును. బయట కార్పొరేట్ ఆసుపత్రిలో ఇట్టి ఆపరేషన్ కి 15 నుండి 20వేల రూపాయలు ఖర్చు అవుతుంది కానీ పేదవారికి సహాయం చేయాలని సంకల్పంతో లయన్స్ క్లబ్,రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో కేవలం 220 రూపాయలకే ఇట్టి ఆపరేషన్ చేయించడం జరుగుతుంది. కావున ముత్తారం మండల ప్రాంత ప్రజలు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతూ కంటి ఆపరేషన్ కి వచ్చి వారు తమ వెంట ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డ్ ,మొబైల్ ఫోన్, బ్లాంకెట్ వెంట తీసుకువెళ్లాలన్నారు. రక్త పరీక్షల నిమిత్తము 220 రూపాయలు తెచ్చుకోగలని కోరారు. మరిన్ని వివరాలకు అబ్బూ కేశవ రెడ్డి 9849885837, గంట వెంకటరమణ రెడ్డి 9849655990 లను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ,క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి,మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి, ఉపాధ్యక్షులు కదారి కళాధర్ రెడ్డి, శ్రీధర్ ,గ్రామ కార్యదర్శి దిలీప్ ,క్లబ్ సభ్యులు మేకల మారుతి యాదవ్, తాళ్లపల్లి చంద్రమౌళి, మద శ్రీకాంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కాందిశీక నాయకుడికి పరామర్శ

ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని టీటీఎస్ అంతర్గాం కాలనీకి చెందిన బర్మా, శ్రీలంక కాందిశీకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఇండిబెల్లి రవీందర్‌కుమార్‌ను అంతర్గాంరామగుండం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంజాల రాధాస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి సందూరి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి కాంపెల్లి మల్లిఖార్జున స్వామి, స్థానిక నాయకులు అర్నపల్లి రాజు, ఆవుల విజయ్‌పాల్‌లు శనివారం పరామర్శించారు.

# పిల్లల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ప్రజాపక్షం/జైనూర్ :జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. శనివారం సిర్పూర్ (యు) మండలం రాఘాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన రిజిస్టర్లు, నిత్యవసర సరుకులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని, లోపం గల పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం, మందులు అందించాలని సూచించారు. అంగన్వాడీ పరిధిలో గర్భిణీ మహిళలు సమీప ప్రభుత్వ ఆసుపత్రుల్లో తమ వివరాలు నమోదు చేసుకుని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన మందులు అందించాలని తెలిపారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున త్రాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళిక చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణ చర్యలను పరిశీలించారు. వేసవిలో మొక్కలకు తగిన నీరు అందించాలని, మొక్కల పరిరక్షణలో భాగంగా షెడ్ నెట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లింగాపూర్ మండలం గుమునూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించి, రికార్డులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జైనూర్ సిడిపిఒ ఇంద్ర, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## మౌలానా ఆజాద్ స్మారక క్లాక్ టవర్ నిర్మాణానికి కృషి

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ జిల్లా కేంద్రంలో అర్ధంతరంగా నిర్మాణాలు నిలిచి ఉన్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మారక క్లాక్ టవర్ నిర్మాణానికి తన బంధువు కృషి చేస్తానని డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు భరోసా ఇచ్చారు.శనివారం నిర్మల్ పట్టణంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌరస్తాలో కలాం గుణం ఎడ్యుకేషనల్ యూత్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మౌలానా ఆజాద్ 66వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.22 సంవత్సరాలుగా నిలుచున్న ఇతరత్రా విషయాలను తెలుసుకొని వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి మాట్లాడుతూ మత సమైక్యవాది స్వాతంత్ర సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరిట కలాం గుణం ఎడ్యుకేషనల్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమైనవని చెప్పారు.క్లాక్ టవర్ నిర్మాణ పనులను సమన్వయంతో పూర్తించేలా ముందుకు వెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయాల చైర్మన్ సత్తు మల్లేష్,కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ మతీన్,నబకలీం,అహెతేశ్యాం అలీ,సొసైటీ వ్యవస్థాపకుడు జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ చాంద్ పాషా.పట్టణాధ్యక్షా,ప్రధాన కార్యదర్శులు మొహమ్మద్ బిన్ అలీ,బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ నజీరుద్దీన్,మాజీ కౌన్సిలరఉన్నారు.

## పలు పేద కుటుంబాలకు బియ్యం, నగదు అందజేత



ప్రజాపక్షం/రామగిరి : పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ గ్రామ పంచాయతీ లో ఇటీవల మరణించిన పలు పేద కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి పటేల్ ఆధ్వర్యంలో శనివారం బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు. గోకుల్ నగర్ పేద కుటుంబానికి చెందిన గోపు రాజయ్య, ఇటీవల మరణించిగా సుందరం ఫౌండేషన్ ఫౌండర్, మాజీ ఎంపిటిసి2 బోనాల వెంకటస్వామి పటేల్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి 25 కిలోల బియ్యంతో పాటు Rs.2000/ రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే దుర్కి లక్ష్మి మల్లు ,నరిగే పెద్ద మల్లయ్య, అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి 25కిలోల బియ్యం అందజేసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.మా ఫౌండేషన్ ద్వారా ప్రతీ పేద భాధితుడికి సాయం అందించాలనే లక్ష్యం తోనే మా సంస్థ పనిచేస్తుందని అలాగే నిస్వార్థంగా పేద వారికి సాయం అందించడమే మా ఫౌండేషన్ సభ్యుల లక్ష్యమని ఈసందర్భంగా బోనాల వెంకటస్వామి పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కన్నూరి నగేష్, చిప్పకుర్తి అరవింద్, చెన్నోజు చంద్రశేఖర్, దండే తిరుపతి, గుంజపడుగు నవీన్, కుక్క వర ప్రసాద్, కామ సంతోష్ లతో పాటు గోకుల్ నగర్ కి చెందిన కుల పెద్దలు ఐన నరిగే మల్లేష్, కోరే బీరయ్య, కొమ్ము షేరాలు, తూండ్ల రాజన్న, కొమ్ము మల్లేష్, గోపు పర్వతాలు మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా నాయకురాలికి పరామర్శ

ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ గౌసియా బేగం అనారోగ్యంతో పెద్దపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కర్మాగారం పర్మినెంటు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు, కన్నాల ప్యాక్స్ చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి గౌసియా బేగంను పరామర్శించారు. ఆరోగ్య, చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## ‘ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా’ సమావేశంలో ఈగ సంజీవరెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :ఢిల్లీలో నిర్వహిస్తున్న ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సమావేశంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి ఢిల్లీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అర్చరీ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ బీజేపీ అధ్యక్షులు వీరేంద్ర సచ్‌దేవ్, జార్ఖండ్ మాజీ సిఎం అర్జున్ ముండా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి డాక్టర్ జయిరీస్ పాల్, సహ కార్యదర్శి గుంగన్ ఆబోల్, తెలంగాణ అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ పలు రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/అంతర్గాం : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం సమావేశం హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఈసీఈ ఆడిటోరియంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో టీజీఓల అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్, కార్యదర్శి లెంకల బ్రహ్మానందరెడ్డిలు హాజరయ్యారు. పెద్దపల్లిలో అసోసియేషన్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తూము రవీందర్ పటేల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీలు, పీఆర్సీ, మెడికల్ రీఎంబర్స్‌మెంటు, ఈహెచ్ఎస్, ఓపీఎస్ వంటి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర నాయకులను కోరినట్లు తెలిపారు. ఈ ఏడాది అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలియజేయడం జరిగిందన్నారు.

## కౌశిక హరి అరెస్టుపై అంతర్గాంలో నిరసన



ప్రజాపక్షం/అంతర్గాం : గోదావరిఖనిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరిని పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఆ పార్టీ మండల నాయకులు గ్యాలంకి ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఎన్టీపీసీ బూడిద చెరువుల వద్ద జరుగుతున్న అక్రమాలు తెలుసుకునేందుకు ప్రజల పక్షాన అక్కడికి వెళ్తున్న కౌశిక హరిని, బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టు చేయడం సరైందికాదన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత మార్గాన అవినీతి, అక్రమాలను పరిశీలించడం ఏవిధంగా తప్పు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొబ్బల తిరుపతి, ఒల్లెపు మల్లేష్, అరవింద్, ప్రశాంత్‌గౌడ్, ఆరుముల్ల కుమార్, నక్క రాజయ్య, కిశోర్, దుర్గం శంకర్‌లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుందర్ రాజ్ యాదవ్‌ను గెలిపించాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట:** వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ గెలుపు ఖాయం అయినట్లు మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమి టీ సభ్యులు ప్రచారంలో దీమ వ్యక్తం చేశారు. శనివారం నాడు మెపా రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్, బీసీ నేత డేగల శ్రీనివాస్ ముదిరాజ్‌తో పాటు మెపా కమిటీ సభ్యులు నర్సంపేట పట్టణంలోని డఫోడిల్స్, పాత్ ఫాండర్ లతో పాటు పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, ఉపాధ్యాయులను కలిసి బహుజన నేత, తెలంగాణ ఉద్యమ నేత సుందర్ రాజు యాదవ్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించగలరని కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో డేగల శ్రీనివాస్ ముదిరాజ్, ఎలబోయిన కుమారస్వామి యాదవ్, చరక నారాయణ, పవన్, పొన్నం రాజు,పెండ్యాల కృష్ణ, వీరే శం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీగట్టుమల్లికార్జునస్వామి జాతరకు ఏర్పాట్లు చేయాలి



**ప్రజాపక్షం/ వేలేరు :** శ్రీగట్టుమల్లికార్జునస్వామి మహాశివరాత్రి జాతరకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా ఆర్‌డిఒ రమేష్‌రాథోడ్ వేలేరు మండల ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామశివారులోని శ్రీగట్టుమల్లికార్జునస్వామి దేవాలయంలో స్టేషన్‌పూర్ నియోజకవర్గం ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి ఆదేశానుసారం ఆలయ ఇఒ అద్దంకి నాగేశ్వర్‌రావు ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మహాశివరాత్రి జాతర సమీక్షాసమావేశానికి హనుమకొండ జిల్లా ఆర్‌డి ఒ రమేష్‌రాథోడ్ హాజరై శ్రీగట్టుమల్లికార్జుస్వామిని దర్శించుకొని మండలంలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి జాతర సంధర్భంగా శ్రీగట్టుమల్లికార్జునస్వామి దేవాలయానికి చుట్టుప్రక్కల ప్రాంతాలనుండి దాదాపుగా 70 వేలకుపైగా భక్తులు ప్రతియేటా వచ్చి మొక్కులు సమర్పించుకుంటున్న సంధర్భంగా రవాణా సౌకర్యార్థం హనుమకొండ బస్ డిపో నుండి (ఆర్‌టిసి)బస్ సౌకర్యం,దేవాలయ ప్రాంగణంలో మంచి నీటి వసతులు,వైద్యసదుపాయం,సానిటేషన్,ట్రాఫిక్ ఆంక్షలు,విద్యుత్ తదితర సంబందిత శాఖల అధికారులు తమకు సంబందించిన విధులను సక్రమంగా నిర్వహించి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని ఆదేశించారు అలాగే దేవాదాయశాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు,సిసి కెమెరాల ఏర్పాటులో తగుజాగ్రత్తలు తీసుకోవాలని కోరారు ఈకార్యక్రమంలో ఆర్‌డిఒ రమేష్‌రాథోడ్,తహశీల్దార్ కోమి,ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న,డాక్టర్ మేఘన,ఇ ఒ అద్దంకి నాగేశ్వర్‌రావు,విద్యుత్ ఎ ఇ కుమారస్వామి,మిషన్‌భగీరత ఎ ఇ సుధ,ఎంపిఒ భాస్కర్,ఆర్‌ఐ సురెందర్,హెచ్‌ఇఒ వెంకటేశ్వర్లు,గ్రామపంచాయితీ కార్యదర్శి వెంకటేష్,మాజీసర్పంచ్ గోదల రాజిరెడ్డి,మాజీచైర్మన్ బొజ్జ సమ్మయ్య యాదవ్,ఆలయఅర్చకులు మహేష్‌శర్మ,ఒగ్గు పూజారులు,వివిధశాఖల అదికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతలతో.. ఎంతో మేలు

**మోరంచ లిఫ్ట్ తో 600 ఎకరాలకు సాగునీరు**
**భారీ వర్షాలకు ముంపుకు గురైన మోరంచ లిఫ్ట్**
**30 లక్షలతో లిఫ్ట్ పునరుద్ధరణ పనులు పూర్తి**
**హర్షం వ్యక్తం చేస్తున్న 220 రైతులు**
**ఎమ్మెల్యే చొరవతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు**

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి మండలం మోరంచ వాగుపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గతంలో కురిసిన భారీ వర్షాలకు నీటిలో మునిగిపోయింది. పోయిన ఏడాది జూలైలో భారీగా కురిసిన వర్షాలకు మోరంచ జల ప్రళయంలో చిక్కుకున్న విషయం విధితమే. రాష్ట్రంలోనే చర్చనీ అంశంగా మారింది. ఈ ముంపులో మోరంచ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కూడా ముంపుకు గురైంది. ఈ ఎత్తిపోతల ప్రాజెక్టు 1970లో 12 వందల ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం కోసం ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. క్రమక్రమంగా ఆయకట్టు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ కింద సుమారు 600 ఎకరాలు 220 మంది రైతులు ఆయకట్టు కు సాగునీరు అందేది. వరదల్లో ముంపుకు గురై మోటార్లు, స్టార్టర్లు, ప్యానెల్ బోర్డులు పైపులు ఉపకేంద్ర యార్డు అన్ని కొట్టుకపోయి శిథిలావస్థలో ఉండి రైతుల సాగుకు ఇబ్బందిగా మారింది. దీంతో మోరంచ పల్లి రైతులు రైతులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ను కలిసి ముంపుకు గురైన లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మత్తులు చేయించాలని కోరారు. అందుకుగాను రూ.30 లక్షల రూపాయలను గండ్ర సత్యనారాయణ రావు చొరవ చూపి మంజూరు చేయించారు. వెంటనే పనులు ప్రారంభించి మరమ్మత్తు పనులను పూర్తి చేశారు. దీంతో 600 ఎకరాల ఆయకట్టుకు లిఫ్ట్ ద్వారా నీటిని ఎత్తిపోశారు. వెంటనే స్పందించి మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు మోరంచ రైతులు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో తెగిన 240 చెరువులకు మరమ్మత్తులు ఎమ్మెల్యే గండ్ర చొరవతో చేయించారు. మోరంచపల్లి పరివాహక ప్రాంతం వారి సాగుతో పచ్చదనంతో 600 ఎకరాల లో పచ్చదనం తో పంటపోలాలు కలకలలాడుతుంది.







**లిఫ్ట్ తో రైతులకు ఎంతో మేలు :** మోరాంచ పల్లి లిఫ్ట్ నీటిలో మునిగి రైతులకు ఇబ్బందికరంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లిఫ్ట్ ఇరిగేషన్ కు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చొరవతో 30 లక్షలతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసి 220 మంది రైతులకు 600 ఎకరాల కు నీరు అంది మేలు అందుతుంది. ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ ఇచ్చి రైతులకు మేలు చేసే ఇది కాంగ్రెస్ ప్రభుత్వమే.



**చాడ రఘునాథ్ రెడ్డి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు**

# 30వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ పట్టణంలోని బాణాపురం రోడ్డులో ఎల్లంల, పెద్దరాంచర్ల, సిద్దెంకి తదితర గ్రామాలకు వెళ్లడం కోసం బైపాస్ వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 30వ రోజుకు చేరాయి. శనివారం ఐద్వా నాయకురాలు గిద్దెల స్వప్న దండలు వేసి నిరాహార దీక్షల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైసాప్ దాటుతు అటు వెల్లడం కోసం అనేక గ్రామాల ప్రజలతో పాటు డబుల్‌బెడ్‌రూం కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అందుకే అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు స్పందించక పోవడం విడ్డూరమన్నారు. రోజువారిగా కూలీ పనులు చేస్తూ జీవించే వారు అండర్‌పాస్ కోసం ప్రతి రోజు నిరాహార దీక్షలు చేస్తున్నారని వారి న్యాయపరమైన డిమాండ్‌ను గుర్తించి అయినా జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు. రీలే నిరాహార దీక్షలతో ప్రభుత్వం స్పందించకుంటే వివిధ గ్రామాల ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుండె మల్లేష్, బొట్ల ఎలేంద్ర, రమా భాస్కర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాయినిగూడెం పిహెచ్ తనిఖీ



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి గోపాలరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రొయ్యూరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకై, రోజు వస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకొని, ఆరోగ్య కేంద్రంంలోని మందుల నిల్వల గదిని, ల్యాబ్ టెక్నీషియన్ రూమును, రిజిస్టర్‌లను పరిశీలించారు. అటు తర్వాత సిబ్బందితో మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని, లేనియెడల శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రకాంత్, స్టాఫ్ నర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** తాడ్వాయి మండలంలోని కొడిశేల గ్రామానికి చెందిన పిడబోయిన లక్ష్మయ్య ఇటీవల మృతి చెందగా వారి కుమారులైన సతీష్, వెంకన్న, వారి కుటుంబ సభ్యులను బిఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగ జ్యోతి స్థానిక నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించి వారికి 50 కెజిల బియ్యాన్ని అందజేసి వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట బిఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు దండగుల మల్లయ్య, మాజీ జడ్పిటిసి రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి పాయం నరసింహారావు, యాప నారాయణ, చేల లక్ష్మి, మంకిడి లక్ష్మి, పిడబోయిన సుగుణ, నాలి కాంతారావు, ఇర్ప విజయ, నాలి రమేష్, చింత సమ్మక్క, పాయం నర్సింగరావు, ఊరికే రమేష్, చెన్నూరి వెంకన్న, పాయం లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.